క్లుప్తంగా

రాధాకృష్ణ కుటుంబాన్ని ఆదుకుంటాం



రాధాకృష్ణ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్తున్న ఆర్డీఓ కిశోర్ తదితరులు

కాకినాడ రూరల్: వైద్య ఆరోగ్య శాఖలో ఫైలేరియా విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ అదృశ్యమైన కె.రాధాకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆర్డీఓ ఇట్ల కిశోర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రత్నకుమార్ తెలియజేశారు. మండలంలోని ఇంద్రపాలెంలో రాధాకృష్ణ నివాసానికి గురువారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కలెక్టరు ఆదేశాల మేరకు రాధాకృష్ణ కుటుంబానికి అండగా ఉండేందుకు వచ్చామన్నారు. యానాం – ఎదుర్లంక వద్ద గోదావరిలోకి రాధాకృష్ణ దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తుండడంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సిబ్బంది ద్వారా గజ ఈతగాళ్లతో గోదావరి తీర ప్రాంతంలో అన్వేషిస్తున్నట్టు తెలిపారు. కుటుంబ సభ్యులు అధైర్య పడొవద్దని ఓదార్చారు.

దొంగతనాలపై జాగ్రత్త



దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్న సీఐ వైఆర్‌కే శ్రీనివాస్

కాకినాడ రూరల్: సర్పవరం స్టేషన్ పరిధిలోని కాకినాడ నగరం, రూరల్ గ్రామాలలోని ప్రజలు దొంగతనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కోరారు. సర్పవరం జంక్షన్‌లో గురువారం ఆయన మైక్ పట్టుకుని ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఇంట్లో ఉంచుకుని ఊళ్లకు వెళ్లవద్దన్నారు. తప్పని సరి పరిస్థితుల్లో ఊళ్లకు వెళ్లాల్సి వస్తే పోలీసులకు ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే మహిళలు బయటకు షాపింగ్, ఇతర పనులకు వెళ్లినప్పుడు మెడలో బంగారు ఆభరణాలకు కొంగు కప్పుకోవాలని సూచించారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వెంబడించినా, బైక్‌లపై వచ్చినా జాగ్రత్త వహించాన్నారు. చైన్ స్నాచర్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇళ్ల వద్ద వీలైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో రోటరీ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ రోటరీ క్లబ్ గవర్నర్ వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులైన పి.ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ వై.లక్ష్మి, సూపర్‌వైజర్ బి.మార్తమ్మ, రోటరీ మాజీ గవర్నర్ లక్కరాజు సత్యనారాయన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా చాగంటి



ప్రమాణస్వీకారం చేస్తున్న వెంకట్రావు

కరప: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్తగా చాగంటి వెంకట్రావును నియమిస్తూ దేవదాయ, ధర్మదాయ శాఖ నుంచి గురువారం ఉత్తర్వులు వచ్చాయి. ఈ ఆలయాన్ని 1918లో చాగంటి వంశీయులు నిర్మించారు. ఇప్పటి వరకూ ఆ వంశీయులే నిర్వహిస్తున్నారు. కాగా ఆలయాన్ని, ఆలయానికి రాసిన భూమిని దేవదాయశాఖకు నివేదించగా వెంకట్రావును ఈ మేరకు ధర్మకర్తగా నియమించినట్టు అధికారులు తెలిపారు. స్వామికి పూజల అనంతరం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పి.ఫణీంద్రకుమార్ వెంకట్రావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. కరప, వేళంగి, కాకినాడ, కైకవోలు ఈఓలు కె.తిరుమల రవితేజ, మోర్త మురళీ వీరభద్రరావు, వడ్డాది సత్తిబాబు, డి.శ్రీనివాస్, అన్నవరం దేవస్థానం పాలకవర్గ మాజీసభ్యుడు చాగంటి సూరిబాబు, పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ

కాకినాడ సిటీ: తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయిని టీఎస్‌వీ కామేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల చదువుకు అవసరమయ్యే మౌలిక వసతులు కల్పనతో పాటు విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, బెల్ట్, టై, బ్యాగులను అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి, ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. గ్రామపెద్దలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఒంటిమామిడి జంక్షన్ మలుపులో సాగుతున్న మొక్కజొన్న పొత్తుల వ్యాపారం



సీబీఎం స్కూల్ సమీపంలోని మలుపులో చిరు వ్యాపారుల బళ్లు



గాంధీనగర్ రైతుబజార్ రోడ్డు మలుపులో వ్యాపారం..

మలుపుల్లో ముప్పు

- ప్రధాన ప్రాంతాల్లో యథేచ్ఛగా వ్యాపారాలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు

కాకినాడ లీగల్: కాకినాడ స్మార్ట్‌సిటీగా ఉన్నా ట్రాఫిక్ సమస్య మాత్రం అంతకంతకూ పెద్దదవుతోందే తప్ప తగ్గడం లేదు. దాంతో వాహనచోదకులు, నగరవాసులు ఇబ్బందులకు గురికాక తప్పడం లేదు. నగరంలోని పలు ప్రధాన మలుపుల్లో బళ్లపై వివిధ వ్యాపారాలు చేసుకుంటున్న వారు పలు ప్రమాదాలకు కారణమవుతున్నా వారిని నియంత్రించడంలో, వారికి సరైన స్థలం చూపడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఆ ప్రాంతాల్లోని వినియోగదారులు ఆ బళ్ల వద్దకు చేరడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాకినాడ గాంధీనగర్ రైతుబజార్ రోడ్డు మలుపులో బళ్ల వ్యాపారాలు చేస్తున్నారు. అలాగే కాకినాడ ఒంటిమామిడి జం**క్షన్ వద్ద టర్నింగ్ పాయింట్‌లో మొక్కజొన్న పొత్తుల వ్యాపారం చేస్తున్నారు. ఇంద్రపాలెం బ్రిడ్జి టర్నింగ్ పాయింట్‌లో పూల వ్యాపారం, కాకినాడ సీబీఎం స్కూల్ టర్నింగ్ పాయింట్‌లో, రామారావుపేట సుబ్బయ్యహోటల్ టర్నింగ్‌లో,** బాలాజీచెరువు సెంటర్ టర్నింగ్‌లో, రెడ్ క్రాస్ వీధి టర్నింగ్‌లో అనేక ప్రాంతాల్లో బళ్లపై వ్యాపారులను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడడంతో పాటు వారికి సురక్షితమైన వ్యాపార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే సమయాల్లో ఆయా మలుపుల్లో ఉండే వ్యాపారుల వద్ద బైక్‌లు ఆపి కొనుగోలు చేస్తుండడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఆ సమయంలో రోడ్డుపై వెళ్లే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఇంద్రపాలెం బ్రిడ్జి మలుపులో నిర్వహిస్తున్న పూలు, పళ్ల వ్యాపారాలు

నిబంధనలు పాటించాలి



రోడ్డుపై వ్యాపారం చేసేవారు నిబంధనలు పాటించాలి. రహదారుల మలుపుల్లో బళ్లపై వ్యాపారం చేయడం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే. ఈ విషయంపై వ్యాపారం చేసేవారికి అనేక సార్లు అవగాహన సదస్సు పెట్టి వివరిస్తున్నాం. నిబంధనలు పాటించకపోతే వారిపై చర్యలు తీసుకుంటాం.

– చైతన్యకృష్ణ,
సీఐ ట్రాఫిక్–2, కాకినాడ

లక్ష్యం.. ఫ్లెక్సీ ఫ్రీ సిటీ



అనుమతిలేని ఫ్లెక్సీలను సిబ్బందితో కలిసి తొలగిస్తున్న కమిషనర్ భావన

- అనుమతి లేని ఫ్లెక్సీలు తొలగించండి
- సెప్టెంబర్ కల్లా లక్ష్యం సాధించాలి
- అధికారులకు కమిషనర్ భావన ఆదేశం

కాకినాడ: అనుమతి లేని ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక వెంకట్ నగర్‌లోని సురేష్ చికెన్ సెంటర్ నుంచి సాయిబాబా ఆలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ నగరపాలక సంస్థ అనుమతి లేని ఫ్లెక్సీలు అన్నింటినీ తక్షణమే తొలగించాలని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు. అనుమతి లేని ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లను తొలగించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కోరారు. సెప్టెంబర్ నాటికల్లా కాకినాడను ఫ్లెక్సీ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నగర సుందరీకరణను దృష్టిలో ఉంచుకొని ఆయా వ్యాపార సంస్థలు నగరపాలక సంస్థకు సహకరించి అనుమతి లేని ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. అలా తొలగించని పక్షంలో నగరపాలక సంస్థ తరఫున తొలగించి వాటిని ఏర్పాటు చేసిన సంస్థలపై తగిన చర్య తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, పలువురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పాలిథిన్ కవర్లకు దూరంగా ఉండండి

పర్యావరణానికి హాని కలిగే తక్కువ మందం కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లకు దూరంగా ఉండాలని కమిషనర్ భావన పిలుపునిచ్చారు. స్థానిక 27వ డివిజన్ తిలక్ వీధిలోని సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద నుంచి ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ర్యాలీని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నిషేధించిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వీటికి ప్రత్యామ్నాయంగా కాటన్ బ్యాగులను ఉపయోగించాలని సూచించారు. ఆ మేరకు విద్యార్థులు చైతన్యవంతులు కావాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సుంకర పావని, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

మడ అడవులను సంరక్షించుకుందాం

- జిల్లా అటవీ అధికారి భరణి
- విద్యార్థులకు పోటీల నిర్వహణ

కాకినాడ సిటీ: మడ అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి అన్నారు. అంతర్జాతీయ మడ అడవి ఆవరణ వ్యవస్థ, పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం జగన్నాథపురం ఎంఎస్ఎన్ చార్టీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, తాళ్లరేవు మండలాల్లో ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులకు మడ అడవుల సంరక్షణపై చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ పోటీలకు 43 పాఠశాలలు, కళాశాలల నుంచి 289 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు శుక్రవారం బహుమతులు అందిస్తామన్నారు. ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ మడ అడవుల ఆవరణ వ్యవస్థ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలవబడే డాక్టర్ రాజేంద్రసింగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఎస్ సుబ్రహ్మణ్యం, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ విజయకుమారి, ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జి.సూరిబాబు, ఎంవీఎస్ రామకృష్ణ, బి.లక్ష్మి, కె.దుర్గాప్రసాద్, అధ్యాపకులు చిట్టిబాబు, శ్రీమన్నారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి భరణి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా అటవీ అధికారి భరణి తదితరులు

సమాజ సేవలో రోటరీ ముందంజ



సమావేశంలో మాట్లాడుతున్న క్లబ్ గవర్నర్ వెంకటేశ్వరరావు

బోట్‌క్లబ్: సమాజ అవసరాలు తీర్చడంలో రోటరీ సభ్యులు ముందుంటారని రోటరీ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమాన్ని పరిశీలించి అక్కడ వృద్ధులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. ఆటిజంతో బాధపడుతున్న చిన్నారులకు తమ క్లబ్ అండగా ఉంటుందన్నారు. కాకినాడ రోటరీ క్లబ్ అధ్యక్షులు పోలిశెట్టి ఈశ్వరరావు ఆధ్వర్యంలో మహర్షి సాంబమూర్తి దివ్యాంగ పాఠశాల చిన్నారులకు కావాల్సిన నిత్యావసర వస్తువులను ధరణి రామారావు సౌజన్యంతో అందించారు. మహేష్‌బాబు ఫౌండేషన్ ద్వారా నిరుపేద విద్యార్థికి ల్యాప్‌టాప్ అందించడంతో పాటు, భవిష్యత్ ఫీజులు మొత్తం చెల్లించేందుకు ఏర్పాట్లు చేశారు. క్లబ్ సెక్రటరీ తడాల వీవీ సత్యనారాయణ, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ప్రసాద్, పబ్లిక్ ఇమేజ్ కమిటీ చైర్మన్ తడాల వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రాచ్యం ప్రభవించెనహో..!



ప్రత్యక్ష నారాయణా ఎక్కడికెళ్లావయ్యా ఇన్నాళ్లూ.. నీరదాలకు ఆవల నీ రథంతో ఎటో వెళ్లిపోతే మేమేమైపోవాలి స్వామీ.. నీవు ఏడు గుర్రాలతో దారి తప్పితే ఆ ఏడు రోజుల పాటు మేమిక్కడ నిలువునా తడిసి ముద్దైపోయి.. చలికి ఒణికిపోయి.. ఒరిసిపోయి.. నానా అవస్థలూ పడ్డామనుకో. నేలతల్లి సైతం ఎడతెరిపి లేని వానలకి తడిసి ముద్దై నానిపోయి నీరు ఇంకించుకోలేక మా పచ్చని పైర్లను ముంచేసింది. వచ్చావు కద స్వామీ.. నీ దయ ఉంటే మాకేం లోటు చెప్పు.. మా నానిన పంటలూ ఎండుతాయి.. మా పైర్లూ తేరుకుంటాయి.. అన్నీ సుభిక్షంగా ఉంటాయి. స్థానిక కుంభాభిషేకం వద్ద వెచ్చని కిరణాలు ప్రసరిస్తూ తూరుపు నుంచి పైకొచ్చిన భానుడిని చూసినవారంతా హమ్మయ్య.. వానలు వెళ్లాయిరా బాబూ అని ఊపిరి పీల్చుకున్నారు.

– కాకినాడ రూరల్

ప్రత్యామ్నాయ పంటలు వేయండి



రైతులతో ఆయిల్ పామ్ మొక్కలు నాటిస్తున్న ఎంఏఓ రాజేష్, వీఏఏ ప్రశాంత్

కరప: నీటి ఎద్దటి ఉండే పొలాల్లో వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్, డ్రాగన్ ఫ్రూట్, పైనాపిల్ వంటి పంటలు వేసుకుంటే లాభసాటిగా ఉంటుందని ఎంఏఓ ఏవీ రాజేష్ సూచించారు. కరపలో గురువారం ఆయన ఆర్బీకే వీఏఏ ప్రశాంత్‌తో కల్సి ఇసుకభూములు, శివారు, మెరకప్రాంత భూముల రైతులను కలసి ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఇసక పొర కలిసిన భూములు, మెరక భూములకు తరచుగా సాగునీటి ఎద్దడి తలెత్తుతోందని, అలాంటి ప్రదేశాల్లో వరికి ప్రత్యామ్నాయంగా లాభసాటిగా ఉండే ఇతర పంటలు పండించాలని రైతులకు సూచించారు. నక్కావారి ఎస్సీపేటకి వెళ్లే దారిలో కొంతమంది రైతులు వరిపంటకు బదులుగా ఆయిల్ పామ్ మొక్కలు నాటేందుకు ముందుకు రాగా ఆయా రైతులతో ఆ మొక్కలు నాటించారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై ఎటువంటి సమాచారం కావాలన్నా ఆర్బీకేలో సంప్రదించాలని ఎంఏఓ తెలిపారు.

విత్తనాలు ఉచితంగా ఇవ్వండి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రభుత్వం రైతులకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ రామ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. కాకినాడలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వర్షాలతో రైతులు నష్టపోయారని, రైతులు మళ్లీ విత్తనాలు చల్లుకోకతప్పదన్నారు.

పిల్లలు లేని వారికి ఐవీఎఫ్ ఒక వరం



డాక్టర్ మాధవిని సత్కరిస్తున్న ఐడీఏ సభ్యులు

బోట్‌క్లబ్: పిల్లలు లేని వారికి ఐవీఎఫ్ ఒక వరమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు పురుషులకు ఐవీఎఫ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యాధికారి అడబాల మాధవి మాట్లాడుతూ వంధ్యత్వంతో పోరాడుతున్న దంపతులకు బిడ్డను కనడానికి సహాయపడే ఒక వైద్య ప్రక్రియ ఐవీఎఫ్ అని వివరించారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు.. అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, శ్రీవల్లి పాల్గొన్నారు.

భారత సైన్యం సేవలు మరువలేనివి

బోట్‌క్లబ్: శత్రు దేశాలకు సరైన జవాబు చెప్పిన భారత సైన్యం సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. 25 ఏళ్ల క్రితం సైనిక ఘర్షణలో అమరులైన వీర జవాన్లకు నివాళులర్పిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ చేశారు. స్థానిక బాలాజీ చెరువు సెంటర్ నుంచి జెడ్పీ కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాపారావు, యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి దొడ్డి వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రమణయ్యపేటకు ఎన్నికలు నిర్వహించాలి



సదస్సులో పాల్గొన్న వక్తలు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట గ్రామ పంచాయతీకి పాలకులు లేక 13 ఏళ్లుగా అభివృద్ధి సాగడం లేదని పౌర సదస్సు అభిప్రాయం వ్యక్తం చేసింది. పౌర సంక్షేమ సంఘం పిలుపు మేరకు రమణయ్యపేట కమ్యూనిటీ హాలులో గ్రామస్తులతో మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పౌర సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్లపూడి రమణ రాజు మాట్లాడుతూ 2013లో గవర్నర్ ఆర్డినెన్స్ ద్వారా గ్రామాల విలీనం చేపట్టిన ప్రభుత్వం 2017 కాకినాడ నగరపాలక సంస్థలో రూరల్‌లోని ఎనిమిది గ్రామాలను విలీనం చేసి కార్పొరేషన్ ఎన్నికలతో పాటు వీటికి కూడా నిర్వహించాల్సి ఉంది. కానీ ఆ దిశగా ఏ చర్యలు లేవన్నారు. రూరల్‌లోని ఎనిమిది గ్రామాలను విలీనం చేసి కార్పొరేషన్ ఎన్నికలతో పాటు వీటికి కూడా ఎన్నికలు నిర్వహించాలి లేదా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఎటూ కాకుండా ప్రజా పాలన లేకుండా చేయడం భావ్యం కాదన్నారు. ఎన్నికల నిర్వహణకై ఎనిమిది గ్రామాల పెద్దలతో కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు రమణరాజు తెలిపారు. అడబాల మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రతి ఐదేళ్లకు ఒకసారి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. కానీ రూరల్ మండలంలో 8 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించక పోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అలాగే పంచాయతీ ఎన్నికలు నిర్వహించి వాటి తీర్మానం ప్రకారం విలీనం చేయాలా లేదా అనేది నిర్ణయించాలని గతంలో కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో రాయుడు అనిల్, కేవీపీ బాలాజీ, పోతుల శ్రీనివాస్, కోడి సీతారామయ్య, పాలిక శ్రీనివాస్, పి. వేణు బాబు, చింతపల్లి అజయ్ కుమార్ తదితర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

అపరిచితులతో అప్రమత్తం

కరప: ప్రేమ పేరుతో మోసాలు ఎక్కువగా జరుగుతన్నాయని, కిడ్నాప్‌ల వంటి ఉదంతాలు జరుగుతున్న నేపథ్యంలో అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సెట్రాజ్ సీఈఓ ఏవీఎస్ఎన్ మూర్తి సూచించారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ విద్యార్థినులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో చదువుపైనే ఏకాగ్రతతో ఉండాలని సూచించారు. అమ్మాయిల అక్రమ రవాణా ఎలాజరుగుతున్నదీ, వాటి పర్యవసనాలు వివరించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ట్రైనర్ రమ్యసుధ మాట్లాడుతూ బాలికలకు బ్యాడ్, గుడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఎం.శ్రీరామచంద్రమూర్తి, పి.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సెట్రాజ్ సీఈఓ, ట్రైనర్, ఉపాధ్యాయులు

రహదారి భద్రతపై అవగాహన అవసరం

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటి): స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రహదారి భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రాంతీయ రవాణా అధికారి మురళీకృష్ణ, ట్రాఫిక్ సీఐలు చైతన్యకృష్ణ, రమేష్, మెడికల్ ఆఫీసర్ పద్మావతి, మండల లీగల్ కమిటీ అధ్యక్షుడు సునీల్ పాల్గొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. వాహనాలు క్షేమంగా నడిపి తల్లిదండ్రుల్లో భద్రతా భావాన్ని కల్గించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ ఆంజేయులు మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవ్ చేయాలన్నారు. మెడికల్ ఆఫీసర్ పద్మావతి మాట్లాడుతూ ప్రమాదాల్లో జరిగే గాయాలు, ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు చేయాల్సిన ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐలు చైతన్య కృష్ణ, రమేష్‌లు ట్రాఫిక్ రూల్స్, హెల్మెట్ అవశ్యకతను, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ జాన్ శామ్యూల్, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.జయదేవ్, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ తిరుపాణ్యం

తాగునీటి కాలుష్యంపై ప్రత్యేక డ్రైవ్

- ఇంటింటా తాగునీటి నమూనాల సేకరణ
- ట్యాంకులు, పైప్‌లైన్ల మరమ్మతులకు చర్యలు

కాకినాడ సిటీ: గ్రామీణులకు రక్షిత నీటిని అందించేదుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో తాగునీరు కలుషితం కాకుండా అవసరమైన జాగ్రత్తలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా ట్యాంకులను శుభ్రం చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా కాకినాడ రూరల్ మండలం తూరంగి డ్రైవర్స్ కాలనీ, ఏఎస్ఆర్ కాలనీల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా కలుషిత, అపరిశుభ్ర నీరు రావడంతో పంచాయతీ అధికారులు గురువారం ఆయా ప్రాంతాల్లో ఇంటింటా నీటి నమూనాలు సేకరించారు. అనంతరం తాగునీటి పైప్‌లైన్లలో లీకేజీల గుర్తింపునకు చర్యలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు మాట్లాడుతూ గ్రామస్తులకు రక్షిత నీరు అందించేందుకు ట్యాంకులను శుభ్రం చేస్తున్నామని, అయినా డ్రైవర్స్‌కాలనీ, ఏఎస్ఆర్ కాలనీలకు సరఫరా అవుతున్న నీరు కొద్దిగా మురుగుగా ఉందని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో నీటి నమూనాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజినీర్ శ్రీదేవి, కాలనీ వాసులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైవర్స్ కాలనీలో సేకరించిన తాగునీటిని పరీక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు